నీట్‌ను మళ్లీ నిర్వహించండి

అవకతవకలపై విచారణ జరిపించాలి

బీఆర్ఎస్వీ ఆధ్వర్యంలో రాజ్‌భవన్ ముట్టడి ◆ పీఎం..సీఎం డౌన్ డౌన్ అంటూ నినాదాలు

గేట్లు దూకేందుకు విద్యార్థుల యత్నం ◆ అరెస్టు చేసిన పోలీసులు

సిటీబ్యూరో/ఖైరతాబాద్/హిమాయత్‌నగర్, జూన్ 18 (నమస్తే తెలంగాణ) : ''మోదీ దిగిపో..తప్పుని ఒప్పుకొని బహిరంగ క్షమాపణ చెప్పాలి. 24 లక్షల మంది విద్యార్థుల ఉసురుతగులుతది. ఎవరి ప్రయోజనాల కోసం విద్యార్థుల జీవితాలతో చెలగాటం ఆడారు? మీ స్వార్థం..మీ లాభం కోసం మా అవకాశాలను అమ్ముకుంటారా? ఈ లీకేజీ వెనక ఉన్నది ఎవ్వరు? దేశ వ్యాప్తంగా నీట్ అవకతవకలపై పెద్ద ఎత్తున నిరసన జరుగుతుంటే ప్రధాని మౌనంగా ఉండటం సిగ్గుచేటు. ప్రతి విద్యార్థి కన్నీటి చుక్కకు కేంద్రం సమాధానం చెప్పాలి. నీట్ పరీక్షను రద్దు చేయాలి. లేకపోతే దేశ వ్యాప్తంగా పోరాటాన్ని ఉధృతం చేస్తాం. సీఎం రేవంత్ రెడ్డి ఇక్కడ మౌనంగా ఉండటం కూడా మోదీ మెప్పు పొందడానికేనా? ఇక్కడి బిడ్డలకు అన్యాయం జరిగితే స్పందించరా? స్పందించకపోతే సీఎం కార్యాలయాన్ని ముట్టడిస్తాం.'' అంటూ సుమారు 12 విద్యార్థి సంఘాలు బీఆర్ఎస్వీ, ఏఐఎస్ఎఫ్, ఏఐవైఎఫ్, ఎస్ఎఫ్ఐ,పీడీఎస్ యూ, ఎన్ ఎస్‌యూఐ, విద్యార్థి జనసమితి, డీవైఎఫ్ఐ, పీవైఎల్,ఆమ్ ఆద్మీపార్టీ విద్యార్థి విభాగాల నాయకులు నీట్ అవకతవకలపై విరుచుకుపడ్డారు. పీఎం మోదీ, సీఎం రేవంత్ రెడ్డిలు ఎందుకు మౌనంగా ఉంటున్నారో సమాధానం చెప్పాలంటూ నినదించారు. విద్యార్థులు నీట్‌కు వ్యతిరేకంగా జరిగిన ఆందోళనలో పోస్టర్లు, బ్యానర్లు ప్రదర్శిస్తూ గొంతెత్తారు. నారాయణ గూడ నుంచి లిబర్టీ చౌరస్తా వరకు ర్యాలీ తీశారు. పీఎం డౌన్ డౌన్.. సీఎం డౌన్ డౌన్ అంటూ నినాదాలు హోరెత్తించారు. అవకతవకలపై సిట్టింగ్ జడ్జితో విచారణ చేయించాలని విద్యార్థి నాయకులు డిమాండ్ చేశారు.

బీఆర్ఎస్వీ రాష్ట్ర అధ్యక్షుడు గెల్లు శ్రీనివాస్ యాదవ్ ఆధ్వర్యంలో రాజ్‌భవన్ ముట్టడికి తరలివస్తున్న విద్యార్థి నాయకులు

రాజ్‌భవన్ ముట్టడి ఉద్రిక్తం...

బీఆర్ఎస్వీ ఆధ్వర్వంలో రాజ్‌భవన్ ముట్టడి యత్నం జరిగింది. మెరుపు ముట్టడితో రాజ్‌భవన్ వద్ద ఉద్రిక్తత ఏర్పడింది. బీఆర్ఎస్వీ రాష్ట్ర అధ్యక్షుడు గెల్లు శ్రీనివాస్ యాదవ్ ఆధ్వర్యంలో విద్యార్థులు రాజ్‌భవన్ గేట్లు ఎక్కేందుకు ప్రయత్నించారు. పెద్ద సంఖ్యలో రోడ్డుపై బైఠాయించి కేంద్ర వైఖరిని, రాష్ట్ర ప్రభుత్వ అలసత్వాన్ని ఎండగట్టారు. ఈ సందర్భంగా గెల్లు శ్రీనివాస్ యాదవ్ మాట్లాడుతూ మూడున్నర కోట్ల జనాభా ఉన్న తెలంగాణలో 8,850 సీట్లు ఉన్నాయని, 25 కోట్ల జనాభా ఉన్న ఉత్తర్ ప్రదేశ్‌లో 9,500 సీట్లు ఉన్నాయని, తద్వారా ఎక్కువ సీట్లు ఉత్తర భారతదేశానికే పోతున్నాయన్నారు. ఇటీవల జరిగిన నీట్ ప్రవేశ పరీక్షల్లో ఇక్కడి నుంచి వేలాది మంది విద్యార్థులు హాజరయ్యారన్నారు. ఎడ్యుకేషన్ హబ్‌గా ఉన్న హైదరాబాద్‌కు ఒక్క సీటు కూడా రాకపోవడం విచారకరమన్నారు. ఒక్క ఎంబీబీఎస్ మాత్రమే కాదని, ఆయూష్, వెటర్నరీ, బీడీఎస్ తదితర విభాగాల్లోనూ తెలంగాణకు నష్టం జరుగుతుందన్నారు. నీట్ పరీక్షలు నిర్వహించే నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీని ముందుగా రద్దు చేయాలని, సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించి బాధ్యులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో ముఖ్యమంత్రిగా కేసీఆర్ వైద్య రంగానికి పెద్ద పీట వేశారని, జిల్లా కేంద్రాల్లో మెడికల్ కళాశాలలు ఏర్పాటు చేయడం వల్ల కావాల్సినంత సీట్లు స్వరాష్ట్ర విద్యార్థులకు లభించాయన్నారు. కేంద్ర ప్రభుత్వం ఇప్పటికే దక్షిణాదిపై వివక్ష చూపుతుందని, 150 వైద్య కళాశాలలు కేటాయించగా, అందులో ఒక్కటి కూడా తెలంగాణకు ఇవ్వకపోవడంతోనే వివక్ష వెలుగుచూసిందన్నారు. ఇప్పటికే తమిళనాడు ప్రభుత్వం నీట్‌ను వ్యతిరేకించిందని, సీఎం రేవంత్ రెడ్డి మాత్రం పట్టించుకోవడం లేదని, వెంటనే కేబినేట్ తీర్మాణం చేసి నీట్ నుంచి తెలంగాణను ఉపసంహరించుకోవాలన్నారు. ఈ వ్యవహారంలో బీజేపీ నేతల హస్తం ఉందని ఆరోపించారు. సీఎం రేవంత్ రెడ్డి, కేంద్ర మంత్రులు కిషన్ రెడ్డి, బండి సంజయ్‌లు ఎందుకు స్పందించడం లేదని ప్రశ్నించారు. సీఎం స్పందించకుంటే ఆయన కార్యాలయాన్ని సైతం ముట్టడిస్తామన్నారు. బీఆర్ఎస్వీ నాయకులు జంగయ్య, నితీశ్, లోకేశ్, శ్యామ్, రాహుల్, వంశీ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థి నాయకులను చెదరగొడుతున్న పోలీసులు

వెంటనే రద్దు చేయాలి

బీఆర్ఎస్వీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు తుంగ బాలు

ఉస్మానియా యూనివర్సిటీ, జూన్ 18: గత నెల 5న దేశంలోని 571 నగరాల్లోని 4,750 కేంద్రాల్లో నిర్వహించిన నీట్ పరీక్షను వెంటనే రద్దు చేయాలని బీఆర్ఎస్వీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు తుంగ బాలు డిమాండ్ చేశారు. ప్రపంచంలో ఎక్కడా లేని విధంగా ఒక ప్రవేశ పరీక్షలో 67 మంది గరిష్ట మార్కులు సాధించడం గిన్నీస్ రికార్డు సాధించడమేనని ఎద్దేవా చేశారు. ఎన్డీయే భాగస్వామి జేడీయూ అధికారంలో ఉన్న బీహార్ రాష్ట్రం నీట్ పరీక్షలో అక్రమాలకు వేదికవడం సిగ్గుచేటన్నారు. దేశంలో 70 వేల సీట్ల కోసం జరిగే నీట్ పరీక్షల్లో ప్రతిభ కన్న డబ్బే ప్రధానం అనే రీతిలో వ్యవహరించడం సరికాదన్నారు.

నీట్‌ను వెంటనే రద్దు చేయాలని నినదిస్తున్న బీఆర్ఎస్వీ విద్యార్థి నాయకులు

భవిష్యత్ ప్రశ్నార్థకం

కవాడిగూడ: నీట్ పరీక్ష అవకతవకలపై సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించాలని బీఆర్ఎస్వీ రాష్ట్ర నాయకుడు విశాల్ కుమార్ డిమాండ్ చేశారు. రాష్ట్ర వ్యాప్తంగా 70 వేల మంది విద్యార్థులు నీట్ పరీక్షకు హాజరైతే నీట్ పరీక్షలో జరిగిన అవకతవకలతో వారి భవిష్యత్ ప్రశ్నార్థకంగా మారిందన్నారు. మంగళవారం నీట్ పరీక్షను రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ బీఆర్ఎస్వీ రాష్ట్ర కమిటీ ఇచ్చిన చలో రాజ్‌భవన్ పిలుపు మేరకు బీఆర్ఎస్వీ రాష్ట్ర నాయకుడు విశాల్ ఆధ్వర్యంలో ఇందిరాపార్కు నుంచి వందలాది మంది విద్యార్థులు తరలివెళ్లారు. బీఆర్ఎస్వీ నేత నితీశ్ కుమార్ విద్యార్థులు పాల్గొన్నారు.

బ్రాహ్మణ పరిషత్ పాలక వర్గాన్ని ఏర్పాటు చేయాలి

మేడ్చల్, జూన్18(నమస్తే తెలంగాణ): తెలంగాణ బ్రాహ్మణ పరిషత్ పాలక వర్గాన్ని తక్షణమే ఏర్పాటు చేయాలని తెలంగాణ బ్రాహ్మణ పరిషత్ మాజీ సభ్యురాలు సుమలతశర్మ కాంగ్రెస్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం విదేశీ విద్యకు అర్హత సాధించిన పేద విద్యార్థులకు బ్రాహ్మణ పరిషత్ ద్వారా నిధులు మంజూరు చేసిందన్నారు. ఏడు నెలలుగా బ్రాహ్మణ పరిషత్ ద్వారా ఎలాంటి నిధులు విడుదల చేయని కారణంగా విద్యార్థుల భవిష్యత్ ప్రశ్నార్థకరంగా మారిందన్నారు.

ఎథికల్ హాకింగ్ కోర్సుల్లో శిక్షణ

కాచిగూడ,జూన్ 18: కేంద్ర ప్రభుత్వ ఆమోదిత నేషనల్ స్కిల్ అకాడమీ ఆధ్వర్యంలో ఆన్‌లైన్‌లో కంప్యూటర్ శిక్షణ, సైబర్ సెక్యూరిటీ, ఎథికల్ హాకింగ్ కోర్సుల్లో శిక్షణకు తెలంగాణ వ్యాప్తంగా ఆసక్తి గల యువతీ, యువకుల నుంచి దరఖాస్తులను కోరుతున్నట్లు నేషనల్ స్కిల్ అకాడమీ ప్రోగ్రామ్ కోఆర్డినేటర్ శ్రీమాన్‌రెడ్డి తెలిపారు. మంగళవారం కాచిగూడలో విలేకరులతో ఆయన మాట్లాడుతూ ఇన్ఫర్మేషన్ రంగం,ఆర్కిటెక్ట్,సెక్యూరిటీ విభాగం, మిషన్ లెర్నింగ్, బిజినెస్ అనలిస్ట్,డేటాసైన్స్,బిగ్ డేటా,క్లౌడ్ కంప్యూటర్, జావా, ఒరాకిల్ కోర్సుల్లో శిక్షణ ఇవ్వన్నుట్లు తెలిపారు. ఇంటర్, డిగ్రీ,పాలిటెక్నిక్, డిప్లొమా, పీజీ, ఇంజినీరింగ్ చదివిన యువకులు 30వ తేదీలోపు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని కోరారు. వివరాలకు 9505800050, www.nationalskillacademy.inలో సంప్రదించవచ్చని కోరారు.

స్టెమ్ సబ్జెకుల్లో మహిళలకు ప్రోత్సాహం

సిటీబ్యూరో, జూన్ 18 (నమస్తే తెలంగాణ): మహిళలకు సైన్స్ అండ్ టెక్నాలజీ, ఇంజినీరింగ్, మ్యాథమెటిక్స్ (స్టెమ్) అంశాల్లో నైపుణ్యం పెంపొందించేందుకు సింజీన్ ఇంటర్నేషనల్ లిమిటెడ్ ప్రత్యేక కార్యక్రమాన్ని చేపట్టింది. రీసెర్చ్ అండ్ ఇన్నోవేషన్ సర్కిల్ ఆఫ్ హైదరాబాద్ సహకారంతో మహిళలకు స్కాలర్‌షిప్, మెంటరింగ్ చేస్తోంది. తాజాగా మంగళవారం టీ హబ్‌లో జరిగిన రెండో విడుత కార్యక్రమానికి 549 దరఖాస్తులు వచ్చాయని సింజీన్ ఇంటర్నేషనల్ లిమిటెడ్ డైరెక్టర్ డాక్టర్ అనుపమ శెట్టి తెలిపారు. మొదటి విడుతలో 21 మంది మహిళలను ప్రోత్సహించామని తెలిపారు. రెండో విడుతలోనూ మరింత మంది మహిళలకు అకడమిక్ కెరీర్ ఎదుగుదలతో తోడ్పడేలా చేస్తామన్నారు.

ఆశవర్కర్ల సేవలు అభినందనీయం

సిటీబ్యూరో, జూన్ 18 (నమస్తే తెలంగాణ) : ఆశవర్కర్ల ప్రాధాన్యతను గుర్తించి వారికి అత్యధికంగా ఇన్‌సెంటివ్స్ రూ.9,900 అందిస్తున్న రాష్ట్రాల్లో తెలంగాణ దేశంలోనే రెండో స్థానంలో ఉందని హెల్త్ అండ్ ఫ్యామిలీ వెల్ఫేర్ కమిషనర్ మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈనెల 14న నమస్తే తెలంగాణలో 'చాకిరీ బారెడు.. వేతనం మూరెడు' అనే శీర్షికతో కథనం ప్రచురితమైంది. దీనిపై కమిషనర్ స్పందిస్తూ.. ఆరోగ్య రంగంలో ఆశ వర్కర్ల పాత్ర చాలా కీలకమైనదని అన్నారు. గుజరాత్, కేరళ, రాజస్థాన్, కర్ణాటక, సిక్కిం తదితర రాష్ట్రాల్లో ఆశ వర్కర్లకు రూ.4 వేల నుంచి రూ.6వేల మధ్యలోనే వేతనం చెల్లిస్తున్నారని తెలిపారు. ఆశ వర్కర్లకు ప్రోత్సాహం అందించేందుకు ఎన్ఐఓస్ సర్టిఫికెట్ పొందిన వారికి అదనంగా రూ.5 వేలు పొందుతారని తెలిపారు.

విద్యా ప్రమాణాలు మెరుగు పడాలి

అబిడ్స్, జూన్ 18: అంతర్జాతీయ స్థాయిలో విద్యా ప్రమాణాలు మెరుగు పడాల్సిన అవసరం ఎంతైనా ఉందని రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు అన్నారు. ఎగ్జిబిషన్ సొసైటీ అనుబంధ విద్యా సంస్థ అయిన సరోజిని నాయుడు వనితా ఫార్మసీ మహా విద్యాలయ చైర్మన్ డాక్టర్ ప్రభాశంకర్ అధ్యక్షతన మంగళవారం నాంపల్లి ఎగ్జిబిషన్ మైదానంలోని గాంధీ సెంటనరీ హాల్‌లో నిర్వహించిన సిల్వర్ జూబ్లీ వేడుకల ముగింపు బహుమతుల ప్రదానోత్సవ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. వెనకబడిన ప్రాంతాల్లో విద్యా వ్యాప్తికి పాటు పడుతూ సామాజిక బాధ్యతను నిర్వహిస్తున్న ఎగ్జిబిషన్ సొసైటీ కృషి అభినందనీయమని కొనియాడారు. ఎగ్జిబిషన్ సొసైటీకి అనుబంధంగా ఉన్న విద్యా సంస్థలకు, ఇక్కడి విద్యార్థులకు సీఎం రేవంత్‌రెడ్డి నాయకత్వంలోని ప్రభుత్వం నుంచి అన్ని రకాల సహాయ సహకారాలు అందజేస్తామని తెలిపారు. రాబోయే రోజుల్లో మరిన్ని విద్యా సంస్థలను స్థాపించి తెలంగాణలో విద్యను ప్రోత్సహిస్తూ ప్రభుత్వం చేపడుతున్న విద్యాభివృద్ధిలో భాగస్వాములు కావాలని సొసైటీ ప్రతినిధులకు పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా విద్యార్థినులకు సర్టిఫికెట్‌లు, మెడల్స్‌ను అందజేసి సత్కరించారు. రాష్ట్ర ఉన్నత విద్యా మండలి చైర్మన్ ప్రొఫెసర్ లింబాద్రి, ఎగ్జిబిషన్ సొసైటీ ప్రతినిధులు అష్వాక్ హైదర్, డాక్టర్ గంగాధర్‌రావు, బీఎన్ రాజేశ్వర్, జీవీ రంగారెడ్డి, ఎగ్జిబిషన్ సొసైటీ కార్యదర్శి హనుమంతరావు, కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ మమత, వైస్ ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ శిరీష, ప్రొఫెసర్ శ్రీనివాస్, కళాశాల కార్యదర్శి సాయినాథ్ దయాకర్ శాస్త్రి, ఉస్మానియా గ్రాడ్యుయేట్స్ అసోసియేషన్ తదితరులు పాల్గొన్నారు.

సరోజిని నాయుడు వనితా ఫార్మసీ మహా విద్యాలయ చైర్మన్ డాక్టర్ ప్రభాశంకర్‌ను సత్కరిస్తున్న ఐటీ శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు

అగ్రికల్చర్ యూనివర్సిటీ వీసీని నియమించండి

టాసా అధ్యక్షుడు విద్యాసాగర్

వ్యవసాయ యూనివర్సిటీ, జూన్ 18: ప్రొఫెసర్ జయశంకర్ రాష్ట్ర వ్యవసాయ యూనివర్సిటీ నియామకాలపై ప్రభుత్వం జాప్యం చేస్తుందని దీంతో ఇటు విద్యార్థులకు రైతులకు అపార నష్టం జరుగుతుందని తెలంగాణ అగ్రికల్చర్ శాస్త్రవేత్తల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు (టాసా) విద్యాసాగర్ తెలిపారు. మంగళవారం రంగారెడ్డి జిల్లా రాజేంద్రనగర్ లోని తన కార్యాలయంలో ఆయన విలేకర్లతో మాట్లాడారు. సీఎం రేవంత్ రెడ్డి ఆధ్వర్యంలో కాంగ్రెస్ ప్రభుత్వం వ్యవసాయ అనుబంధ రంగాలను చిన్న చూపు చూస్తున్నారని మండిపడ్డారు. యూనివర్సిటీకి పూర్తిస్థాయి పాలక వర్గం, పర్మినెంట్ యూనివర్సిటీ అధికారులు, వీసీలేక పోవడం, ప్రధాన నిర్ణయాలు తీసుకోక పోవడంతో దిశానిర్దేశంలేని పరిస్థితి దాపురించిందన్నారు. మెడికల్ బిల్లు క్యాంపులోకి ఆర్టీసీ బస్సులు , హెల్త్ సెంటర్ సమస్యలు అధికమయ్యాయన్నారు. విద్యార్థుల సంఖ్య పెరగడం, వసతి సౌకర్యాలు తగ్గడం విద్యార్థి, ఉపాధ్యాయుల రేషియో పడిపోవడంతో బోధన సిబ్బంది సతమత మవుతున్నారన్నారు. ఈ నెల చివరికి మరో ఇద్దరు యూనివర్సిటీ అధికారులు డీన్, డైరెక్టర్ ఆఫ్ ఎక్జేషన్ రిటైర్‌అవుతున్నారని తెలిపారు. సీఎం వెంటనే స్పందించాలని కోరారు.

ఎన్జీఆర్ఐని సందర్శించిన విద్యార్థులు

సిటీబ్యూరో, జూన్ 18(నమస్తే తెలంగాణ) : ఐఐటీ ధన్‌బాద్, ఆంధ్ర యూనివర్సిటీకి చెందిన 26 మంది విద్యార్థుల బృందం హైదరాబాద్‌లోని ఎన్జీఆర్ఐని సందర్శించింది. మంగళవారం ఉదయం క్యాంపస్‌లో పర్యటించి పరిశోధన కేంద్రంలో ఉన్న పలు విభాగాలను విజిట్ చేశారు. ఈ సందర్భంగా ఎన్జీఆర్ఐ పరిశోధకుడు డా. దేవేందర్ కుమార్ విద్యార్థుల బృందానికి రీసెర్చ్ సెంటర్‌లో జరుగుతున్న పలు అధ్యయనాలు, పరిశోధనలపై అవగాహన కల్పించారు. అనంతరం ఎన్జీఆర్ఐ డైరెక్టర్ డా. ప్రకాశ్ కుమార్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు.

పటాన్‌చెరు మెట్రో మార్గాన్ని త్వరగా చేపట్టాలి



మెట్రో రైలు భవన్‌లో మెట్రో ఎండీ ఎన్వీఎస్ రెడ్డిని కలిసిన మెదక్ ఎంపీ రఘునందన్‌రావు

సిటీబ్యూరో, జూన్ 18 (నమస్తే తెలంగాణ): మియాపూర్ నుంచి పటాన్‌చెరు వరకు మెట్రో మార్గాన్ని నిర్మించే పనులు వేగవంతంగా చేయాలని మెట్రో ఎండీ ఎన్వీఎస్ రెడ్డిని మెదక్ ఎంపీ రఘునందన్‌రావు కోరారు. మంగళవారం బేగంపేటలోని మెట్రో రైలు భవన్‌లో ప్రత్యేకంగా సమావేశమయ్యారు. ఎంపీ రఘునందన్‌రావు మాట్లాడుతూ నగర శివారులో ఉన్న ప్రాంతాల్లో పటాన్‌చెరు ఎంతో అభివృద్ధి చెందుతున్నదని, భారీ పరిశ్రమలు, నివాస ప్రాంతాలు గణనీయంగా పెరిగిన నేపథ్యంలో మెట్రో సదుపాయం కల్పించాలన్నారు. మెట్రో ఎండీ ఎన్వీఎస్ రెడ్డి మాట్లాడుతూ రెండో దశ మెట్రో ప్రాజెక్టులో భాగంగా మియాపూర్-పటాన్‌చెరు మార్గం నిర్మించాలని, క్షేత్రస్థాయిలో సర్వే పూర్తి చేసి సమగ్ర ప్రాజెక్టు నివేదికను సిద్ధం చేస్తున్నామని తెలిపారు.

మోకిల శారీథాన్‌కు విశేష స్పందన

సిటీబ్యూరో, జూన్ 18 (నమస్తే తెలంగాణ): పారిశుధ్యంపై విస్తృతంగా అవగాహన కల్పించేందుకు గండిపేట వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో నిర్వహించిన మోకిల శారీథాన్‌కు విశేష స్పందన వచ్చిందని వాణి తిమ్మయ్యగారి తెలిపారు. శారీథాన్‌లో భాగంగా మోకిలలోని పీజీ హిల్స్‌లో నిర్వహించిన 5కే రన్, 3కే రన్ కార్యక్రమాలను నిర్వహించామని కార్యక్రమానికి మహిళలు పెద్ద సంఖ్యలో హాజరయ్యారన్నారు. 5కే రన్ కార్యక్రమాన్ని తెలంగాణ మహిళా కమిషనర్ చైర్ పర్సన్ శారద నేరెళ్ల, రచయిత, నటి గీతా భాస్కర్, భవానీలు జెండా ఊపి ప్రారంభించారన్నారు.

పర్యావరణ పరిరక్షణపై అవగాహన

మల్కాజిగిరి జిల్లా ప్రభుత్వ పాఠశాలలో మొక్కలు నాటుతున్న ఉపాధ్యాయులు

మేడ్చల్, జూన్18(నమస్తే తెలంగాణ): పాఠశాలల్లో పర్యావరణ పరిరక్షణపై విద్యార్థులకు అవగాహన కార్యక్రమాలను విద్యాశాఖ నిర్వహిస్తుంది. పర్యావరణ సమతుల్యత దెబ్బతిని మానవ మనుగుడ ప్రశ్నార్థకరంగా మారుతున్న క్రమంలో విద్యార్థిస్థాయి నుంచే పర్యావరణ పరిరక్షణ లక్ష్యంగా అవగాహన కల్గించి భవిష్యత్‌లో ఎలాంటి ఇబ్బందులు రాకుండా ముందస్తు ప్రణాళిక ఈ కార్యక్రమాలను నిర్వహించే విధంగా విద్యాశాఖ చర్యలు చేపట్టింది. మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా మేడ్చల్, మల్కాజిగిరి, ఉప్పల్, కూకట్‌పల్లి, కుత్బుల్లాపూర్ నియోజకవర్గాలలోని 505 ప్రభుత్వ పాఠశాలలో ఈ నెల 15 నుంచి ఈ కార్యక్రమాలను ప్రారంభించగా 25 వరకు కొనసాగించనున్నారు. ఇందులో 1 వ తరగతి నుంచి 10 వతరగతి చదివే విద్యార్థులందరిని భాగస్వామ్యులను చేస్తున్నారు.

ఆశవర్కర్ల సమస్యలు పరిష్కరించాలి

సుల్తాన్‌బజార్,జూన్ 18: ఆశవర్కర్ల న్యాయమైన డిమాండ్లను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని బీజేపీ మహిళా మోర్చా రాష్ట్ర అధ్యక్షురాలు డాక్టర్ శిల్పారెడ్డి ఆధ్వర్యంలో కోఠి డీఎంహెచ్ఎస్ ఆవరణలో మంగళవారం ఆందోళన చేశారు. శిల్పారెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వం ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని కోరారు. ఆశలకు రూ.9 వేల నుంచి 18 వేలు వేతనం ఇస్తామని తెలిపి అమలు చేయలేదని ఆవేదన వ్యక్తం చేశారు.

కొత్త అడ్వర్టైజింగ్ పాలసీ ఆమోదయోగ్యంగా ఉండాలి

అమీర్‌పేట్, జూన్ 18: తెలంగాణ ఔట్‌డోర్ మీడియా ఓనర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో హోర్డింగ్ యజమానుల సర్వసభ్య సమావేశం బేగంపేట్‌లోని హోటల్ హరిత ప్లాజాలో మంగళవారం జరిగింది. ఈ సమావేశంలో ప్రభుత్వం త్వరలో ప్రవేశపెట్టనున్న కొత్త అడ్వర్టైజింగ్ పాలసీపై అసోసియేషన్ ప్రతినిధులు ఔట్‌డోర్ మీడియా ఎదుర్కొంటున్న సమస్యలపై చర్చించారు. అసోసియేషన్ అధ్యక్షుడు ఇఫ్తికార్ మాట్లాడుతూ ప్రభుత్వం త్వరలో ప్రవేశపెట్టనున్న నూతన అడ్వర్టైజింగ్ పాలసీలో చిన్నా పెద్దా అనే తేడా లేకుండా ఔట్ డోర్ మీడియా యజమానులందరికీ సమాన అవకాశాలు అందేలా చూడాల్సిన బాధ్యత ప్రభుత్వం తీసుకోవాలన్నారు. అసోసియేషన్ ఉపాధ్యక్షుడు తిరుపతిరావు, ప్రధాన కార్యదర్శి రమేశ్, సంయుక కార్యదర్శి విష్ణువర్ధన్, కోశాధికారి రవి కాంత్ సహ కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

ఆర్ఎంపీ, పీఎంపీలపై దాడులు ఆపాలి

సమావేశంలో మాట్లాడుతున్న రాష్ట్ర అధ్యక్షుడు శంకర్ ముదిరాజ్

హిమాయత్‌నగర్,జూన్18: రాష్ట్రంలో ప్రాథమిక వైద్య సేవలు అందిస్తున్న ఆర్ఎంపీ, పీఎంపీలపై జరుగుతున్న దాడులను వెంటనే నిలిపివేయాలని తెలంగాణ అనుభవ వైద్యుల సంఘాల సమాఖ్య రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ చొప్పరి శంకర్ ముదిరాజ్, టీఆర్ఎంపీ, పీఎంపీల సంఘాల నేతలు భాస్కర్,రవిశంకర్ ప్రభుత్వాన్ని కోరారు. మంగళవారం హైదర్‌గూడలోని ఎన్ఎస్ఎస్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ ఎన్నికల ముందు ఆర్ఎంపీ, పీఎంపీలకు శిక్షణ ఇచ్చి సర్టిఫికెట్లను జారీ చేస్తామని మాట ఇచ్చిన కాంగ్రెస్ పార్టీ అధి కారంలోకి వచ్చిన ఆరు మాసాల్లోనే గ్రామీణ వైద్యులకు గుర్తింపు, శిక్షణ ఇవ్వకుండానే దాడులు చేయడం మొదలు పెట్టిందన్నారు. ప్రభుత్వం తక్షణమే గ్రామీణ వైద్యులపై దాడులను నిలిపివేయాలని లేని పక్షంలో రాష్ట్ర వ్యాప్తంగా ఆందోళన చేస్తామని హెచ్చరించారు. సమావేశంలో నాయకులు గట్ల రమాశంకర్,డాక్టర్ వెంకట్‌రెడ్డి, బాలబ్రహ్మచారి పాల్గొన్నారు.